## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా ఉప్పాడ తీర ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, తహశీల్దార్ ప్రసాద్ సూచించారు. ఉప్పాడ, సూరడాపేట తీరప్రాంతాన్ని ఆదివారం వారు సందర్శించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని అవసరమైతే పునరావస కేంద్రానికి తరలిరావాలని తెలిపారు. ఈ పర్యటనలో కార్యదర్శి శ్రీనివాసరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు

మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

# వణుకుతున్న తీరం

- తుపానుతో వాతావరణంలో మార్పులు
- తీర ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు
- కాకినాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిలుపుదల
- అన్నదాతలను వెంటాడుతున్న వరుణ భయం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను తీవ్రవాయుగుండంగా మారడంతో జిల్లా ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ప్రధానంగా తీరప్రాంత వాసుల్లో ఆందోళన ఎక్కువవుతుంది. తుఫాను ముంచుకొస్తూ రెండు రోజులపాటు పెద్ద ఎత్తున గాలులు వీయడంతో పాటు, భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు ఇప్పటికే వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. వేటకు వెళ్ళిన వాళ్ళు వెనక్కి తిరిగి వచ్చారు. రెండు రోజులుగా వేటలేక ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో భారీ గాలులు వీస్తాయనే హెచ్చరికలతో పూరిపాకల్లో నివాసముంటున్న మత్స్యకారుల్లో ఆందోళన ఎక్కువైంది. తుపాన్ కారణంగా ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డును అధికారులు మూసివేశారు. వాహనాల రాకపోకలను నిలుపుదల చేశారు. అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు సూరడ పేటలో ఆదివారం కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, తహశీల్దార్ ప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులకు సూచించారు. అవసరమైతే పునరావాస కేంద్రానికి తరలి రావాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. ఎవరూ ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా నిత్యవసర సరుకులను సిద్ధంగా ఉంచామన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. నెల్లూరు, కృష్ణా జిల్లా మచిలీపట్నానికి సమీపంలో తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చ రికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సిఎం జగన్ అధికారులను ఆదేశించడంతో జిల్లా అధికారులు ఆ మేరకు సహాయక చర్యల్లో మునిగిపోయారు. విద్యుత్, రవాణాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని క్రింది స్థాయి అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శిబిరాల్లో బాధితుల కోసం తాగునీరు, ఆహారం, పాలు అందుబాటులో ఉంచాలన్నారు. తుపాను దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ జిల్లాలకు రూ.కోటి నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

బీచ్‌రోడ్డుపైకి ఎగసి పడుతున్న అలలు

ఉప్పాడ తీరంలో మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న ఆర్‌డిఒ

### అప్రమత్తంగా ఉండాలి

తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని విభాగాల అధికారులూ అప్రమత్తంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ఆదేశిం చారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తీసుకున్న ముందస్తు చర్యలను క్షేత్ర స్థాయిలో ఆయన ఆదివారం ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీ చరణ్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్ఎఫ్‌సిఎల్, రైల్వేడ్రైన్ ప్రాంతాలలో అవుట్ లెట్ లను క్లీనింగ్ చేసే ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడకుండా కల్వర్టులు, అవుట్లెట్లను శుభ్రం చేసేందుకు ఏడు జెసిబిలు, టిఎస్-20 మిషన్లు పని చేస్తున్నాయన్నారు. వర్షపు నీరు స్తంభించిపోతే తొలగించేందుకు మోటార్ల సిద్ధం చేసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే మంచినీటికి ఇబ్బంది లేకుండా పంపు హౌస్‌ల వద్ద జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని కోరారు. పూరిళ్లు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోతే తక్షణమే తొలగించేలా సిద్ధంగా ఉండాలని విద్యుత్, ఉద్యాన విభాగాల అధికారులను కోరారు. వర్షాలు నేపథ్యంలో పారిశుధ్యం క్షీణించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజారోగ్య విభాగానికి సూచించారు. తీర ప్రాంతాన్ని అనుకుని ఉన్న డివిజన్ లలోని ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ఫోన్ చేయవచ్చునని సూచించారు. ప్రజల సౌలభ్యం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004255990 అన్నివేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు.

### అన్నదాతల్లో గుబులు

ఖరీఫ్ సీజన్లో 2.40 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేయగా ఇప్పటి వరకు సుమారు 1 లక్ష ఎకరాలలో ఇప్పటికే వరి కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించగా ఇంకా దాదాపు 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఇంకా కళ్లాల్లోనే ఉండిపోయింది. ఈనెల 6 వరకూ వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు చేశారు. తుపాను నేపథ్యంలో అన్నదాతలు గుబులు గుబులుగా ఉన్నారు. పలువురు ఎక్కడకక్కడ ధాన్యం రాశులపై బరకాలు కప్పి కాపలాగా ఉన్నారు. యంత్రాల ద్వారా కోతలు కోసిన నేపథ్యంలో గత రెండు రోజులుగా ధాన్యంలో తేమశాతం తగ్గకపోవడంతో మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిబంధనలను సడలించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని త్వరితగతన సేకరించాలని రైతులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్, ఇతర అధికారులు

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి - పెదపూడి

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని ఎస్‌పి సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దాడ గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులకు వారధి కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది వాహనదారులు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ రోడ్డున పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. యువత చెడు అలవాట్లుకు బానిస అవుతున్నారని, డ్రగ్స్, ఇతర మత్తుకు లోనై విలువైన జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మత్తుపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్కు దూరంగా ఉండి ఉన్నత జీవితాన్ని కొనసాగిం చాలని సూచించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ గురించి వివరించారు. సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైసిపి ఎస్‌సి విభాగం నాయకుడు దిమ్మల రాజుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో, జిల్లా ఉన్నత పోలీసు అధికారులు నిర్వహిస్తున్న వారధి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని నేరాలు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండి ఉన్నతమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ సిఐ కె.శ్రీనివాసు, ఎస్‌ఐ టి.రామకృష్ణ, ఎఎస్‌ఐ వి.శ్రీనివాసు, స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు.

## ఎప్పటికప్పుడు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఓటు నమోదు కోసం వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సిబ్బందిని ఇఆర్‌ఒ, కమిషనర్ సిహెచ్.నాగ నరసింహరావు ఆదేశించారు. ఆదివారం భానుగుడి రిజర్వు పోలీస్ లైన్ ఆవరణలోని మున్సిపల్ ఉన్నతపాఠశాల, ఎల్‌విఎన్ పేటలోని అంబేద్కర్ కమ్యూనిటీహాలు, రామారావుపేటలోని నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ ప్రజారోగ్య విభాగాల్లోని పోలింగ్‌స్టేషన్, రామారావుపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, సూర్యారావుపేట రామాలయం సమీపంలోని విద్యుత్ డిఇ కార్యాలయం, పైడా సత్తిరాజు మున్సిపల్ ఉన్నతపాఠశాల, నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలోని ఉన్నతపాఠశాల, శ్రీరామ్‌నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఫారం-6, 7, 8 ద్వారా వచ్చే ప్రతీ ఒక్క దరఖాస్తును నిర్ధారణ చేసుకుని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఓటర్లు తుది జాబితా ప్రచురణ తేదీ దగ్గర పడుతున్నందున పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యేక శిబిరాలను సందర్శించిన సందర్భంగా కొత్త ఓట్ల నమోదు కోసం వచ్చిన యువతతో ఆయన మాట్లాడారు.

సామర్లకోట రోడ్డులో కూలిపోయిన హోర్డింగ్

## తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట-జి.రాగంపేట రోడ్లో జగనన్న కాలనీ సమీపాన సిఎం జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన భారీ ఇనుప హోర్టింగ్ ఆదివారం మధ్యాహ్నం వీచిన తీవ్ర గాలులకు ఒక్కసారిగా కుప్ప కూలి పోయింది. అదే సమయంలో వాహనాలు రాకపోకలు మనుషుల సంచారం లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. హోర్డింగ్ కూలి సమయానికి రెండు నిమిషాల ముందే కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. గత నెలలో సిఎం జగన్ పర్యటన సందర్భంగా జగనన్న కాలనీ వద్ద ఈ భారీ ఇనుప హోర్డింగ్ను ఏర్పాటు చేశారు. రోజులు గడుస్తున్న అధికారులు తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫ్లెక్సీలను స్థానికులు పక్కకు తొలగించారు.

## అప్రమత్తమైన రైతన్నలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తూపాన్ ముంచుకొస్తున్న తరుణంలో మండలంలోని రైతులు అప్రమత్తమయ్యారు. పండిన వరి పంటను హడావిడిగా ఒబ్బిడి చేసుకుంటున్నారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రాశులుగా పోసి బరకాలు కప్పుకున్నారు. మండలంలో 11, 500 హెక్టార్ల లో వరి పంట సాగు చేయగా 40 శాతం మేర కోతలు పూర్తియ్యాయని వ్యవసాయ అధికారి ప్రశాంతి తెలిపారు.

### కార్టూ'నిజం'




# దళితులపై పెరుగుతున్న దాడులు

### యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, యు.కొత్తపల్లి

వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన ఆదివారం పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం యండపల్లి జంక్షన్ నుంచి వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట, కోనపాపేట మీదగా పర్యటించారు. త్రోట్ ఇన్ఫెక్షన్ కారణంగా ఉప్పాడలో బహిరంగ సభను రద్దు చేశారు. ఉప్పాడలో చేనేత కార్మికులు లోకేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చేనేత కార్మికుల పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు.
టిడిపి ప్రభుత్వం రాగానే చేనేత రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా పని చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉప్పాడ రింగ్ రోడ్‌లో మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూలపేట, కొత్త మూలపేట, కొనపాప పేట వాసులు నారా లోకేష్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. అనంతరం ఎస్ఇజడ్ శీలంవారి పాకలు జంక్షన్ వద్ద దళిత గళం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దళితులను వైసిపి ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో వివరించారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపేశారని, చీరాలలో కోవిడ్ సమయంలో మాస్క్ పెట్టుకోలేదని కిరణ్‌ను కొట్టి చంపారని గుర్తు చేశారు. పారు. నెల్లూరు నియోజకవర్గంలో దళిత మహిళ దుస్తులు మార్చుకుంటున్న సమయంలో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారన్నారు. తాడిపత్రిలో వైసిపి వేధింపుల వల్ల సిఐ ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో 6వేలమంది దళితులపై దాడులు జరిగాయని తెలిపారు. కాకినాడలో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను కిరాతంగా హత్యచేసి డోర్ డెలీవరీ చేసిన ఎంఎల్‌సి అనంతబాబును ముఖ్యమంత్రి వెంటేసుకుని తిరుగుతున్నాడని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుబ్రహ్మణ్యం హత్యకేసును సిబిఐకి అప్పగిస్తామన్నారు. దళితులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్‌ను పకడ్బందీగా అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ముఖాముఖిలో లోకేష్ పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా కొత్తపల్లిలో విజయదుర్గ నాయీబ్రహ్మణ సేవాసంఘం ప్రతినిధులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాయీ బ్రాహ్మణులకు 50 ఏళ్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందిస్తామన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేసి వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పాడ చేనేతలతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అసమర్థ పాలన కారణంగా చేనేతరంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. టిడిపి హయాంలో చేనేత కార్మికులకు రూ.110కోట్ల రుణమాఫీ చేసి ఆదుకున్నామని గుర్తు చేశారు. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేసి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు మత్స్యకారులతో మాట్లాడుతూ మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. వైసిపి మత్స్యకారులకు తీరని అన్యాయం చేసిందన్నారు. మత్స్యకారులకు పనిముట్లు, బోట్లను సబ్సిడీపై టిడిపి ఇస్తే, వైసిపి రద్దు చేసిందన్నారు. సముద్రంలో ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.5లక్షలు ఇచ్చి ఆదుకున్నామని, వైసీపీ పాలనలో కనీసం చనిపోయిన కుటుంబాలను పరామర్శించే దిక్కు లేదని ఆరోపించారు. లోకేష్ వెంట టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్.వర్మ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, జనసేన ఇన్‌ఛార్జి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గజమాలతో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

## వికలాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

దివ్యాంగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ఆదుకోవాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతల పాటి అప్పలకొండ కోరారు. అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ సందర్భంగా ఆదివారం సామర్ల కోట సిరి మానసిక దివ్యాంగ పాఠశాలలో దివ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అప్పలకొండ స్వీట్స్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుంచే నానిబాబు, అప్పారావు, ఎండి వల్లి భాషా పాల్గొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి కల్పనా పథకాలను ప్రభుత్వం అందిస్తుందని సామర్లకోట మెప్మా సిఎంఎం సుజాత వివరించారు. మెప్మా కార్యాలయంలో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి సుజాత వివరించారు.

దివ్యాంగులతో మానవ హక్కుల సంఘం అధ్యక్షులు అప్పలకొండ

## బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఉప్పాడ వద్ద సముద్ర తీరం అల్లకొల్లాలంగా ఉండటంతో ఆదివారం సాయంత్రం నుంచి బీచ్ రోడ్డులో రాకపోకలను నిలుపుదల చేసినట్లు ఎస్‌ఐ స్వామి నాయుడు తెలిపారు. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ బీచ్ రోడ్డు పైకి చేరడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలుగా రాకపోకలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. ఉప్పాడ రింగ్ రోడ్డు వద్ద పోలీసుల పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

బీచ్ రోడ్డులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

## 6 న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ఈనెల 6న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్ శర్మ, కెవిపి చౌదరి ఓ ప్రకటనలో వెల్లడించారు. 4న మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ బాలలందరికీ భవిత కేంద్రం ఆవరణలో స్పోర్ట్స్, గేమ్స్ నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు తమ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ బాలలందరినీ ఈ పోటీలకు పంపించాలని సూచించారు. 6న జరిగే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సభలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులను అందచేస్తామని తెలిపారు.

## నేడు ఘంటసాల శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం దూలిపూడి గొల్ల బాబు కళ్యాణ మండపంలో సోమవారం ఘంటసాల శతజయంతోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదిలీల ఫౌండేషన్ హైదరాబాద్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఘంటసాల గానావధానం, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలీల ఫౌండేషన్ నాయకులు ఆదినారాయణ తదితరులు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులకు ఘంటసాల పాటలు పాడే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

## హోప్ ఐలాండ్ ప్రజల తరలింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీలో భాగ మైన హోప్ ఐలాం డ్‌లో ఉండే 352 మందిని సురక్షిత ప్రాంతా నికి తరలించినట్లు తహశీల్దార్ ఎస్. పోతురాజు తెలిపారు. వీరికి కాకినాడ డ్రైవర్ కాలనీ వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ పునరావస కేంద్రాన్ని ఆర్‌డిఒ ఐ. కిషోర్ సందర్శించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. హోప్ ఐలాండ్ ప్రాంతంలో ఉన్న గృహాల వద్ద కాపలాగా ఇంకా 24 మంది ఉన్నారని, వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆర్‌బికెల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచామని తెలిపారు. తేమ శాతం ఏ విధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

## పేదలకు సాధ్యమైనంత వరకూ ఉచిత సేవలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

దృష్టి ఐ కేర్ ఆసుపత్రిలో పేదలకు సాధ్యమైనంత వరకూ ఉచితంగానే సేవలు అందించేందుకు కృషి చేస్తామని దృష్టి ఐ కేర్ ఆసుపత్రి ఎండి డాక్టర్ ఎన్.మాధురీ మహన్నత్ తెలిపారు. సామర్లకోట మెహర్ కాంప్లెక్స్ సమీపాన దృష్టి ఐ కేర్ ఆసుపత్రి నూతన బ్రాంచ్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామర్లకోటలో కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురీ మహన్నత్ మాట్లాడుతూ దృష్టి ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 6 వేలకు పైగా ఉచిత కంటి ఆపరేషన్లు అందించినట్లు తెలిపారు. ధనార్జనకు ప్రాధాన్యత ఇవ్వకుండా పేద ప్రజలకు సాధ్యమైనంత వరకు ఉచిత సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. తనకు పిఠాపురం సిఎంసి, కాకినాడలో ఆసుపత్రిలో 15 సంవత్సరాలు, అనుభవం ఉందని, గుంటూరులో ఐ కేర్ ప్రత్యేక శిక్షణ పొందినట్లు డాక్టర్ మాధురి చెప్పారు. త్వరలో ఇఎస్ఐ, ఆరోగ్యశ్రీ, వంటి ప్రభుత్వ పథకాల ద్వారా సేవలకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ ఛైర్మన్ ఉబా జాన్ మోజెష్, సల్లూరి కళ్యాణ్, పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ చిన్ని, నూతలపాటి అప్పలకొండ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంఎల్ఎ చినరాజప్ప

## కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకొచ్చిన సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సిడబ్ల్యూసి మెంబర్ ఎం.ఎం. పల్లంరాజు ఆదేశాల మేరకు పిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను అధ్యక్షతన కాంగ్రెస్ ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, కాంగ్రెస్ కిసాన్ సెల్ కో-ఆర్డినేటర్ ఉమ్మిడి వెంకటరావు ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకటరావు మాట్లాడారు. రాబోయే రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు మోయేటి సూర్యప్రకాశరావు, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా కో-ఆర్డినేటర్ తేజోమూర్తుల ఉషారాణి, ప్రత్తిపాడు బిసి సెల్ అధ్యక్షులు కొల్లు వీర గణేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పన కోటేశ్వరరావు, ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, ప్రత్తిపాడు క్వారీ వర్కర్స్ యూనియన్స్ ప్రెసిడెంట్ చక్రం, కాంగ్రెస్ పార్టీ ఏలేశ్వరం మండల నాయకులు పలివెల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి
www.prajasakti.com



# నేరాలు ఘోరాలు

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

**వేర్వేరు చోట్ల ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు**

ప్రజాశక్తి-యంత్రాంగం

**మండపేట** మారేడుబాక వంతెనవద్ద సైకిల్‌పై వెళుతున్న బాలుని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద నివాసముంటున్న మాడెం రాంబాబు ఒక్కగానొక్క కుమారుడు మాడెం ప్రవీణ్ (11) మరో బాలునితో కలిసి సైకిల్‌పై వెళుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మరో బాలుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఒక్కగానొక్క కుమారుడు ప్రవీణ్ మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. **పెద్దాపురం** కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడకక్కడే మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సామర్లకోటకు చెందిన బొడ్డు రాజు, రమణ బైకుపై పెద్దాపురం వచ్చి తిరిగి సామర్లకోట వెడుతుండగా ఎల్ఐసి కార్యాలయం వద్ద కారు, బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రమణను 108 అంబులెన్స్ ద్వారా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వి.సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. **ఏలేశ్వరం** మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వైసిపి కార్యకర్త అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని సి.రాయవరం గ్రామానికి చెందిన పలివెల బాబూరావు (65) బైకుపై ప్రత్తిపాడు మండలం ధర్మవరం వెళ్లి తిరిగి వస్తుండగా వెనక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలేశ్వరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాబూరావు మృతికి ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, వైసిపి మండల కన్వీనర్ అడపా పార్థసారథి, జడ్‌పిటిసి నీరుకొండ రామకుమారి, మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు, సర్పంచ్ గుమ్ములూరు వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశారు. **గండేపల్లి** మండలం మల్లేపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన బదిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, భార్య సత్యవతితో కలిసి బైకుపై చాగల్లు నుంచి అన్నవరం వెళుతున్నారు. మల్లేపల్లి వద్దకు వచ్చేసరికి సత్యవతి చీర కొంగు బైకు చక్రంలో చుట్టుకుపోయి కింద పడిపోయింది. ఆ సమయంలో వేగంగా వెళుతుండటంతో వాహనం వెనుక కొద్దిదూరం ఈడ్చుకుంటూ పోయింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయం అయ్యింది. వెంటనే ఆమెను 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్, జగ్గంపేట రూరల్

సామర్లకోట రైల్వే గేటు సమీపాన కారు బైక్ ను ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం కాకినాడ నుంచి సామర్లకోట వైపు వస్తున్న కారు టైరు ఫంచర్ కావడంతో సామర్లకోట నుంచి కాకినాడ వైపు బైక్ వెళ్తున్న వ్యక్తిని కారు అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గాయాలపాలయ్యాడు. గాయపడిన వ్యక్తి ఇంద్రపాలెంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జగ్గంపేట రూరల్ మండలంలోని రామవరం వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజమహేంద్రవరం సమీపంలోని ముక్కొల్లుకు చెందిన ముగ్గురు వ్యక్తులు అన్నవరం వెళుతూ మండలంలోని రామవరం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న వాహనాలను క్రాస్ చేయబోయి ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో ముగ్గురు క్రింద పడి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి తలకు బలమైన గాయమైంది. హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.

## పురుగు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురై ఒక యువకుడు పురుగుల మందు తాగి రాజమహేంద్రవరంలో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఊచ్చిలికి చెందిన ఎలికే యాదేశ్వరుడు (25) పూతరేకుల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల ఆర్థికంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 1న పురుగుల మందు తాగాడు. యువకుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం చికిత్స మృతి చెందాడు.

## జాబితా రూపకల్పనలో ఓటర్లు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - ఆలమూరు

సక్రమమైన ఓటర్ల జాబితాల తయారీలో ఓటర్లు అందరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహశీల్దారు ఐపి.శెట్టి అన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాల పరిశీలన చేశామన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు, సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినిగించుకోవడానికి సక్రమమైన ఓటర్ల జాబితాలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఓటరు సంబంధిత బిఎల్ఒ దగ్గర ఓటు నమోదు జాబితాను పరిశీలించుకోవాలని ఆయన కోరారు. ఈ అవకాశం డిసెంబర్ 9 వరకూ కొనసాగుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# గణిత చరిత్రను తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నేటి విద్యార్థులు గణిత శాస్త్ర చరిత్ర తెలుసుకోవడం ద్వారా మన భారతీయ గణిత వేత్తల కృషి అవగతమవుతుందని రామానుజన్ గణిత అకాడెమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెవివి.సత్య నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఎ ఆర్ హైస్కూల్‌లో ప్రముఖ గణిత అవధాని పాఠ్యపుస్తక రచయిత తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన గణిత శాస్త్ర చరిత్రపై గణిత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో భారతీయ శాస్త్రవేత్తల కృషిని వివరించారు. సాయి రామకృష్ణ మాట్లాడుతూ నిత్య జీవితంలో గణిత ప్రాముఖ్యత వివరించారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.శ్రీ కష్ణ సాయి నిజ జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కౌశల్, కోఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వర రావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ పి రవి శంకర్, ఎం.రామ్మోహన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సిహెచ్.దొరబాబు, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటనలకు మున్సిపల్ నిధులా..!

సామర్లకోట రూరల్

మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

సిఎం పర్యటన ఖర్చులను మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి కేటాయిస్తూ తీర్మానించడం శోచనీయమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణ పరిధి జి.రాగంపేట రోడ్డులో జగనన్న కాలనీ ముందు నిర్మించిన భారీ హోర్డింగ్ నెలకొరిగిన ప్రాంతాన్ని ఆదివారం మధ్యాహ్నం ఆయన టిడిపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హోర్డింగ్ వలన ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. జగనన్న కాలనీకి కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం మున్సిపాలిటీకి చెందిన తాగునీటిని కాని, పారిశుధ్య పనులు చేపట్టడం లేదన్నారు. ఇక్కడ వైసిపి ఇన్‌ఛార్జ్ సూపర్ ఎంఎల్ఎగా వ్యవహరిస్తున్నారు తప్ప కనీసం పార్కులు మెయింటెన్స్ కూడా చేయడం లేదన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ మెయింటైన్ చేయడం లేదని, కనీసం మొక్కలకు నీళ్లు వేయించడం లేదన్నారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ చిన్ని, టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రజాల పోటీల్లో న్యాయనిర్ణేతగా రాజు

ప్రజాశక్తి - కాకినాడ

అవార్డును అందుకుంటున్న డాక్టర్ రాజు

కాకినాడకు చెందిన ప్రముఖ ఇంద్రజాలికులు డాక్టర్ బిఎల్ఎన్.రాజు శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ ఇంద్రజాల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. నవంబర్ 25, 26 తేదీల్లో శ్రీలంకలోని శ్రీలంక మెజీషియన్స్ సొసైటీ ఆధ్వర్యాన నిగాంబోలో 7 దేశాల నుంచి పాల్గొన్న ఇంటర్నేషనల్ మ్యాజిక్ ఫెస్టివల్‌లో ఆయన పాల్గొని పలు అంశాలపై లెక్చర్ కం డెమో ద్వారా వివరించారు. అలాగే అంతర్జాతీయ ఇంద్రజాల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 26 సాయంత్రం జరిగిన గాలా షోలో డాక్టర్ రాజు చేసిన ప్రదర్శన శ్రీలంక దేశీయులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ రాజు సేవలకు గుర్తింపుగా శ్రీలంక మెజీషియన్స్ సొసైటీ అధ్యక్షుడు లక్ రువాన్ సుజీవ మేజిక్ మోనార్క్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ తను శ్రీలంక రావడం రెండవసారి అనీ, మొదటి సారిగా అంతర్జాతీయ ఇంద్రజాల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించడం, మ్యాజిక్ మోనార్క్ టైటిల్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కరప

రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కన్నబాబు

రైతులు వద్ద కళ్లాల్లో ఉన్న ధాన్యం తుపాను ప్రభావానికి గురికాకుండా రైస్ మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వ యంత్రాగం అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని గొర్రిపూడి, పెద్దాపురప్పాడు గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. రైతులతో మమేకమై తుపాను దృష్ట్యా ఆఫ్‌లైన్ సౌకర్యం కల్పించడంతోపాటు, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ప్రయివేట్ వాహనాల ద్వారా వరిగడ్డిని తరలిస్తామని అన్నారు. అనంతరం తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి పి.వెంకట రమేష్ మండలంలోని అరట్లకట్ట, గొడ్డేటిపాలెం, కొరిపల్లి, జెడ్.భావరం, పాతర్లగడ్డ, కొంగోడు, యండమూరులో పర్యటించారు. కళ్లాల్లో ధాన్యం ఉన్న రైతులతో మాట్లాడారు. ధాన్యం తరలించేందుకు వాహనాలు ఏర్పాట్లు చేశామని, తేమ ఎక్కువగా ఉన్నప్పటికీ ధాన్యంను మిల్లర్లు తీసుకునేలా నిబంధనలను సడలించారని తెలిపారు. ఈ పర్యటనలో ఎంపిపి శ్రీలక్ష్మి సత్తిబాబు, ఆర్ఐ మాచరావు, విఆర్ఒలు, నక్కా సత్తిబాబు పాల్గొన్నారు.

# ఘనంగా వన సమారాధనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురంలో జరిగిన చేనేతల వన సమారాధనలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

జిల్లాలో పలు మండలాల్లో కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ఆదివారం ముమ్మరంగా సాగా యి. **రౌతులపూడి** మండల కేంద్రమైన రౌతులపూడిలో వెలమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధనను ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బుడ్డి ముత్యాలనాయుడు, నవరత్నాల కమిటీ వైస్ ఛైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు జడ్‌పిటిసి గొల్లు లక్ష్మామూర్తి, అన్నవరం సత్యనారా యణ స్వామి బోర్డ్ మాజీ మెంబర్ వాసిరెడ్డి జమీల్, మండల వ్యవసాయ కమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి భాస్కర్ బాబు, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** చేనేత వర్గాల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో చేనేత వర్గాల వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చేనేత వర్గాల సంఘ అధ్యక్షులు జెట్టి రాజబ్బాయి, తూతిక రాజు, గాంధీ చేనేత సొసైటీ అధ్యక్షులు తూతిక సత్యనారాయణ, విశ్వనాథం పరదేశి, తదితరులు పాల్గొన్నారు. **తాళ్ళరేవు** స్థానిక గుండాబత్తుల శివరామమూర్తి ప్రాంగణంలో తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తాళ్లరేవులో సంఘం భవన నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. **జగ్గంపేట రూరల్** పలు సంక్షేమ సంఘాల ఆధ్వర్యం లో వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన జగ్గంపేట శివారు వెంకటప్రగడ శ్రీరామ్ మూర్తి పామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన తూర్పు కాపు వన సమారాధన కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. అలాగే పోలవరం కాలువ సమీపంలో నిర్మించిన కాపు కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన కాపు వన సమారాధనలో ఎంఎల్ఎ చంటిబాబు, మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాఠంశెట్టి సూర్యచంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా, వైసిపి నాయకులు ఒమ్మి రఘురాం, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో కాపు వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి బాబు, భారతమాత సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్య దొర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా నవోదయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - పెద్దాపురం

సమ్మేళనంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్

స్థానిక నవోదయ విద్యాలయంలో చదువుకుని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం నవోదయ విద్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నవోదయ ప్రిన్సిపల్ ఆర్.కమలం అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో విద్యాలయంతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆనాటి స్మృతులను మననం చేసుకున్నారు. ఈ విద్యాలయంలో చదివిన అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ అండర్ ట్రైని భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విద్యాలయంలో చదువుకోవటం ఉన్నత స్థాయికి చేరుకోవటానికి మార్గమన్నారు. ఈ సందర్భంగా 11, 12 తరగతుల విద్యార్థులతో వారు ఇంట్రాక్ట్ అయి వారికి గైడెన్స్, కౌన్సిలింగ్ వంటి అంశాలపై వారి అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, సత్యనారాయణ, కె.ప్రసాద్, పిఇటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మద్య నిషేధంపై ఒత్తిడి తేవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

యువ గళం పాదయాత్రలో భాగంగా పిఠాపురం విచ్చేసిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళల కన్నీటికి కారణమైన మద్యపానం నిషేధంపై ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలన్నారు. ప్రభుత్వం మద్యాన్ని ఒక ప్రధాన ఆదాయ వనరుగా చూడరాదని, యువతని మద్యం భారీ నుంచి కాపాడాలన్నారు. మద్యం నిషేధంపై టిడిపి మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పావని, సతీష్, విశ్వనాథం, శివ తదితరులు ఉన్నారు.

## యథాతథంగా స్పందన

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 4వ తేదీ సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800 కు కాల్ చేసి సమస్యలు తెలియజేయ వచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు.

# ఘనంగా వికలాంగుల దినోత్సవం

**వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు.**

ప్రజాశక్తి-యంత్రాంగం

రావులపాలెంలో వికలాంగుల దినోత్సవం

**రామచంద్రపురం** వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల జిల్లా నాయకులు పలివెల రాజు విజ్ఞప్తి చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దారు ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే దానిని వికలాంగులకు ఇచ్చేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తాము రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఉన్నామని, రాజకీయ పార్టీలు 4 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో సచివాలయ సిబ్బంది అవగాహన లేకుండా వికలాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి 2016 చట్టాన్ని అమలు చేసే విధంగా ఒక జిఒ జారీ చేయాలని కోరారు. అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని తీర్మనం చేసిందని తీర్మానం కాపీని తహశీల్దారుకు చూపించారు. రేషన్ కార్డులు ఉన్న ఉద్యోగస్తులను తక్షణమే ఆ కార్డు నుంచి తొలగించాలని, ఒంటరిగా ఉన్న వికలాంగులకు రేషన్ కార్డు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల అధ్యక్షుడు పలివెల రాజు, నాయకులు రాయుడు బుల్లయ్య, కష్టారెడ్డి, శ్రీను, నాగేంద్ర, కాదా శ్రీను, మల్లికార్జునరావు, దిగిమర్తి శ్రీను, రమణ, గురుమూర్తి, పలివెల ఉమాదేవి, సత్య నాగరత్నం, వీరలక్ష్మి, మేరీ మంగ పాల్గొన్నారు. **మామిడికుదురు** మదర్ థెరిసా సంక్షమ సంఘం అధ్యక్షుడు జి.రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, సబ్సిడీ రుణాలు అందించాలని, భవన నిర్మాణానికి స్థలం కేటాయించాని కోరారు. వికలాంగుల పింఛను రూ.7 వేలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం** మండలం ఊబలంకలో డాక్టర్ నల్లమిల్లి సూర్యనారాయణ రెడ్డి కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు బాలు రెడ్డి పిల్లలకు పుస్తకాలు ఫ్రూట్స్ పంచిపెట్టారు. సంస్థ కన్వీనర్ నడింపల్లి సుబ్బరాజు వర్మ వివిధ ప్రాంతాల నుంచి దాతలు రోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ వైస్ ప్రెసిడెంట్ కొవ్వూరి దుర్గా రెడ్డి, మల్లిడి రామిరెడ్డి, చింతా నాగిరెడ్డి, తమలంపూడి తాతారెడ్డి, షేక్ ఇస్మాయిల్, కొవ్వూరి సుధాకర్ రెడ్డి, నల్లమిల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## సాగుదారులకే పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సంవత్సరాల తరబడి సీలింగ్ భూములను సాగుచేసుకుంటున్న సాగుదా రులకే పట్టాలు ఇవ్వాలని రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ డిమాండ్ చేశారు. మండలం లోని పులిమేరు రహదారిలో రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జగ్గంపేట మండలం గుర్రంపాలెం సీలింగ్ భూములు సాగు చేస్తున్న కుటుంబాల వారికే పట్టాలు ఇవ్వాలని గుర్రంపాలెంలో నిరవధిక దీక్ష జరుగుతుందని తెలిపారు. ఆ సమస్యను పరిష్కరించాలని ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాల యాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే సాగుదారులంతా నిరవధిక ధర్నాకు దిగారన్నారు. సాగుదారులకు మద్దతుగా ఈ ధర్నాను చేపట్టినట్లు తెలిపారు. అధికారులు స్పందించి సాగుదారులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను తీవ్రత సవరణ చేస్తావని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్, ముసలి బాబు, బీడీల నాగేశ్వరరావు, గుడాల భూషణం, పిల్లి అన్నవరం, వర్ధనపు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## నాగుల చెరువుకు బస్సు వేయాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని నాగుల చెరువు గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ అధికారులు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగులచెరువు గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్న శివారు ప్రాంతం కావడంతో ఆర్‌టిసి అధికారులు ఇప్పటి వరకూ బస్సు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగులచెరువు గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు చదువుల నిమిత్తంవెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక పలు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఇదే సమస్యను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్పందించి నాగుల చెరువు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు, ప్రయాణికులు, అవస్థలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-మండపేట

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు విజయవాడలో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, ఉమ్మడి గోదావరి జిల్లాలలో జరుగుతున్న నారా లోకేష్ పాదయాత్ర తదితర విషయాలు చంద్రబాబునాయుడు ఎంఎల్ఎ వేగుళ్లను అడిగి తెలుసుకున్నారు.

## తాగు నీటి సమస్యపై కార్యాచరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

గ్రామాల్లో తాగు నీటి సమస్య నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ అన్నారు. గెద్దాడలో జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణపనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల గీతాభవాని, జవ్వాది పద్మావతి, జెడ్‌పిటిసి కె.అంజిబాబు, కుసుమ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకలో కోమటి మాణిక్యంకు చెందిన తాటాకు ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురయ్యింది. దీంతో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరా రాజు నిరాశ్రయులైన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్యపడవద్దని కుంటుంబానికి అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. అనంతరం ఆయన 25 కేజీలు బియ్యం, కొంత నగదును, నిత్యవసర వస్తువులను, దుస్తులను అందజేశారు. దీంతో రాజుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైసిపి నేతలు కటారి గంగరాజు, నాగిరెడ్డి సాయి, సింగారపు గంగరాజు, తదితరులు ఉన్నారు.

## విలసవిల్లిలో 'వికసిత్ భారత్' యాత్ర

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ విలసవిల్లి పంచాయితీ కార్యాలయం వద్ద ఆదివారం సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ హెల్త్ కార్డులను ఇఒపిఆర్‌డి కెఎస్ గౌరీ కుమారి అందజేశారు. ఈ సందర్భంగా భీమనపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి దాసరి కష్ణాజీ పాల్గొన్నారు.

## బచ్చు ఫౌండేషన్ ట్రస్టులో సభ్యులుగా చేరాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యాలయాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బచ్చు ఫౌండేషన్ సంస్థలో సభ్యులుగా చేరేవారు దరఖాస్తు చేసుకోవాలని బచ్చు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బచ్చు కోటేశ్వరరావు, సంస్థ ఛైర్మన్ బచ్చు అవినాష్ దేవి చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లోనే కాకుండా అనేక గ్రామాల్లో విద్యాలయాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి విశేష కృషి బచ్చు ఫౌండేషన్ సంస్థ కృషి చేస్తుందన్నారు. తమ సంస్థ సేవలను విస్తృతం చేసేందుకు ఆసక్తి కల్గిన వారు సభ్యులుగా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించార. ఆసక్తి కల్గిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు,ెండు ఫోటోలతో ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఇతర వివరాలకు 85229 11111, 99638 59666 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## నృత్యకారులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కూచిపూడి భరతనాట్యం వంటి కళలను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని సామర్లకోటకు చెందిన ప్రముఖుడు అలెత్తి శ్రీనివాసరావు అన్నారు. సామర్ల కోట భీమేశ్వరాలయంలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాల, తదితర నృత్య కళాకారులు కళాప్రదర్శనకు విచ్చేశారు. అనంతరం వారిని అళక్కి శ్రీనివాసరావు బహుమతులతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

## సత్య దీక్షాపరులకు ఘనంగా పడిపూజ

ప్రజాశక్తి - అన్నవరం

పడిపూజ చేస్తున్న దీక్షాపరులు

కార్తీక మాసం సందర్భంగా అన్నవరం వీర వెంకట సత్యనారాయణ దేవస్థానం కొండపైన సత్య దీక్ష చేపట్టిన వేలాది మంది దీక్షపరులు ఘనంగా పడిపూజ నిర్వహించారు. ఆదివారం రాత్రి సత్యదేవుని వార్షిక కళ్యాణ వేదిక వద్ద దేవస్థానం అర్చకులు దీక్ష పరులతో వివిధ జాతుల పుష్పాలు, బిల్వపత్రాలతో వైదిక పూజలు చేయించారు. అనంతరం దేవస్థానం అధికారులు వీరందరికీ వివిధ రకాల పిండి వంటలతో అల్పాహారం వడ్డించారు. ముందుగా మధ్యాహ్నం 1000 మంది గిరిజన సత్య దీక్షపరులకు ఉచితంగా సామూహిక వ్రతాలు జరిపించారు. కార్తీక సోమవారం స్వామివారి జన్మ నక్షత్రం మఖ పురస్కరించుకుని 27, 18, 9 రోజులపాటు దీక్ష చేపట్టిన సత్య దీక్షాపరులకు ఇరుముడి కట్టించి సోమవారం సన్నిధిలోనే దీక్ష విరమణ చేయిస్తారు.

## సంక్షేమ పథకాలే కొండంత అండ

ప్రజాశక్తి-పెద్దాపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసిపికి కొండంత అండ అని హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైసిపి విజయాన్ని కాంక్షిస్తూ తిరుపతిలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి చేపట్టిన 7 విడతల పాదయాత్రలో భాగంగా ఆదివారం నాలుగో విడత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే జరుగుతున్నాయని అన్నారు. ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి, ఆలయ ఛైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఉబాజాన్ మోసెస్, గోపు మురళి, ఆవాల లక్ష్మీనారాయణ, బండారు వీరబాబు, ఇరుసుమల్ల సాయి, నల్లల గోవిందు, సుందర రెడ్డి రాజు, కుంచె బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి -యానాం

తెలగా (కాపు) అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కాటంశెట్టి వెంకట రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మన్ రాగిరెడ్డి దీప్తి చంద్రకళ, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, డేగల సతీష్, తాతాజీ, అన్నా డిఎంకె కార్యదర్శి మంచాల సత్యకుమార్, బిఎస్‌పి ప్రెసిడెంట్ ధూళిపూడి మాధవ వెంకన్న, గాజుల బ్రహ్మానందం, పాల్గొన్నారు.